సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 14 । మే । 2025



రూ.2.20 లక్షల విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవనం నిర్మాణానికి దాడిశెట్టి విష్ణుచక్రం దంపతులు (తుని) రూ 2.20 లక్షల విరాళం సమర్పించారు.




ఇదేం ఆటంకం?

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కొన్ని క్రీడలకు సంబంధించి, కొంత మంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

8లో

కడలిలోకి 1,869 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 1,869 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

చెత్త గుట్టలు.. స్వచ్ఛ గొప్పలు

- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరిట సర్కారు హడావుడి
- పల్లెలు, పట్టణాల్లో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- కనీస సదుపాయాలు మృగ్యం
- నిధులివ్వని ప్రభుత్వం
- 10 శాతం కూడా లేని డంపింగ్ యార్డులు



రావులపాలెం మండలం రావులపాడులో ఆర్‌అండ్‌బీ రోడ్డు, అమలాపురం పంట కాలువను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు

సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ... ఆచరణలో లేదనడానికి స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమమే ఉదాహరణగా నిలుస్తోంది. రోజువారీ పారిశుధ్య నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేక మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఇబ్బంది పడుతుంటే.. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా మారుస్తామని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. అదనంగా నయా పైసా కూడా విడుదల చేయకుండానే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రచారాన్ని కూటమి ప్రభుత్వం హోరెత్తిస్తోంది.

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీ ఉన్నాయి. వీటితో పాటు 22 మండలాల పరిధిలో 345 పంచాయతీలున్నాయి. వీటిలో మూడో వంతు మేజర్‌వి. రావులపాలెం, కొత్తపేట, రాజోలు, మలికిపురం, అంబాజీపేట, ముక్తేశ్వరం, మురమళ్ల, ద్రాక్షారామ గ్రామాలు పేరుకు పంచాయతీలే అయినప్పటికీ నగర పంచాయతీలకు ఏమాత్రం తీసిపోవు. గడచిన ఐదేళ్ల కాలంలో ఆయా ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు, పారిశ్రామిక ప్రాంతాల నుంచి వస్తున్న చెత్త రెట్టింపైంది. జిల్లా వ్యాప్తంగా రోజుకు 100 టన్నులకు పైగా చెత్త, ఇతర వ్యర్థాలను మున్సిపల్, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సేకరించాల్సి ఉంది. అయితే, దీనికి అవసరమైన సిబ్బందిలో సగం మంది కూడా లేరు. వస్తున్న చెత్తలో 60 శాతం పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే కావడంతో దీనిని ఏం చేయాలో పారిశుధ్య సిబ్బందికి తెలియడం లేదు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు పంట కాలువలు, మురుగునీటి కాలువల ప్రవాహాలకు సైతం అడ్డంకిగా మారుతున్నాయి. రోజువారీ పారిశుధ్య నిర్వహణ మున్సిపాలిటీలకు, పంచాయతీలకు భారంగా మారుతోంది.

పైసా విదల్చని సర్కారు

పట్టణాలు, పల్లెల్లో పారిశుధ్య నిర్వహణకంటూ ప్రభుత్వం అదనంగా నిధులు ఇవ్వడం లేదు. మౌలిక సదుపాయాల కల్పన కూడా లేదు. డంపింగ్ యార్డులకు అవసరమైన భూమి సేకరించడం, చెత్త నుంచి సంపద తయారీ, చెత్త తరలింపునకు అధునాతన వాహనాలు, అవసరమైన పారిశుధ్య సిబ్బంది నియామకం, పారిశుధ్య చర్యలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వంటి బాధ్యతలన్నింటినీ ప్రభుత్వం విస్మరిస్తోంది. వీటికి నయా పైసా కూడా విడుదల చేయకుండానే.. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసి, జోరుగా ప్రచారం చేస్తోంది. ఇంటింటా చెత్త సేకరణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నూతన వాహనాలు సమకూర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ వాహనాలు పూర్తి స్థాయిలో పని చేయడం లేదు. వీటి మరమ్మతులకు నిధులు కూడా ఇవ్వడం లేదు. క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా నియమించిన ఉద్యోగులకు జీతాలు కూడా సవ్యంగా ఇవ్వడం లేదు. ఈ ప్రభావం చెత్త సేకరణపై పడింది.

- అమలాపురం మున్సిపాలిటీలో చెత్త సేకరణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహనాలు అందజేసింది. క్లాప్ పరిధిలోని ఉద్యోగులు దగ్గరుండి చెత్త సేకరణ చేయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీరికి సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. దీంతో ఇప్పుడు చెత్త సేకరణలో సిబ్బంది ఉత్సాహంగా పని చేయడం లేదు. పట్టణంలో సేకరిస్తున్న చెత్తకు డంపింగ్ యార్డు చాలడం లేదు. దీంతో ఈదరపల్లి – నల్ల వంతెన మధ్య బైపాస్ రోడ్డును ఆనుకుని చెత్త వేస్తున్నారు. పక్కనే ఉన్న బండారులంక మేజర్ పంచాయతీకి అసలు డంపింగ్ యార్డే లేకుండా పోవడంతో ప్రధాన రోడ్లు, ఇళ్ల వద్దనే చెత్తను ఉంచి తగుల బెట్టాల్సి వస్తోంది.
- రావులపాలెం మండలం రావులపాడులో ఆర్‌అండ్‌బీ రోడ్డు, అమలాపురం పంట కాలువ మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. దీంతో, అందులోని చెత్తంతా పంట కాలువలోకి వెళ్లి, నీరు కలుషితమవుతోంది.
- కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల్లోని తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో పారిశుధ్య చర్యల గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచింది. ఇటీవల కాట్రేనికోన మండలం పల్లంలో హెపటైటిస్–బీ వ్యాధి ప్రబలడానికి అపరిశుభ్రత కూడా ఒక కారణం.

సంపద సృష్టించని కేంద్రాలు

గ్రామ పంచాయతీల్లో ఒకవైపు కొండలా పేరుకు పోతున్న చెత్తను తగ్గించుకోవడం.. మరోవైపు నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయడం .. వాటి అమ్మకాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడం.. ఇలా మూడు లక్ష్యాలతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మొదలు పెట్టారు. వీటి నిర్వహణలో అంతు లేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లాలో పది శాతం పంచాయతీలకు కూడా డంపింగ్ యార్డులు లేకపోవడంతో రోడ్లు, పంట కాలువల చెంతన చెత్త వదిలేస్తున్నారు. మరోవైపు ప్లాస్టిక్, టైర్ల వంటి వాటిని కూడా తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం ముప్పు ఏర్పడుతోంది. జిల్లాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు 268 ఉన్నాయి. వీటిలో 198 పూర్తిగా పని చేస్తున్నాయని, 46 పాక్షికంగా పని చేస్తున్నాయని, 25 కేంద్రాల్లో వానపాముల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవంగా పని చేస్తున్నది పది శాతం కూడా లేవు. ఈ కారణంగా పంచాయతీల్లో ఆశించిన స్థాయిలో చెత్త సమస్య తీరడం లేదు. ఆదాయం కూడా రావడం లేదు. పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు, సిబ్బందిలో కంపోస్టు తయారీని దాదాపు వదిలేశారు. చాలా పంచాయతీలకు పారిశుధ్య సిబ్బంది లేకపోవడం కూడా దీనికి ఒక కారణంగా మారింది.



అమలాపురం బైపాస్ రోడ్డును ఆనుకుని చెత్త



పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

న్యూస్‌రీల్

వెంకన్న సన్నిధిలో జస్టిస్ కిరణ్మయి



జస్టిస్ కిరణ్మయికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామివారి దర్శనానంతరం పండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు, సిబ్బంది, అర్చకులు స్వామివారి చిత్రపటం అందజేశారు.

సమగ్ర శిక్షా ఏపీసీగా మమ్మీ



జేసీ నిషాంతిని కలసిన ఏపీసీ మమ్మీ

అమలాపురం రూరల్: సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్(ఏపీసీ)గా జి.మమ్మీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ డీఈఓ షేక్ సలీం బాషా ఏపీసీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో మమ్మీని పూర్తి స్థాయి ఏపీసీగా నియమిస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మమ్మీ జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఈఓ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా చెప్పారు.

ప్రజా రవాణా అధికారి కార్యాలయం ముట్టడి



జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని ముట్టడించిన ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యాన జిల్లాలోని అన్ని డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. డ్రైవర్ నారాయణను అన్యాయంగా సస్పెండ్ చేశారని, 78 రోజులుగా ఉద్యమం చేస్తే సస్పెన్షన్ ఎత్తివేశారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కె.పద్మ, కోశాధికారి మోహన్, జిల్లా అధ్యక్షుడు బండి ముత్యాలరావు మాట్లాడుతూ, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని, పదోన్నతులు కల్పించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, సిక్ లీవులకు పూర్తి జీతం చెల్లించాలని, పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి, అన్‌లిమిటెడ్ రిఫరల్ వైద్యం కల్పించాలని కోరారు. ఆందోళనలో యూనియన్ డిపో కార్యదర్శి కె.రవి కుమార్, రామచంద్రపురం డిపో కార్యదర్శి వరలక్ష్మి, రామచంద్రపురం డిపో అధ్యక్షులు నారాయణ, బూరమ్మ, అమలాపురం డిపో ప్రచార కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా సిస్టం సీఈగా శ్రీరామకృష్ణ

ధవళేశ్వరం: గోదావరి డెల్టా సిస్టం సీఈగా ఆర్.శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ఎస్ఈగా ఉన్న ఆయన ఇప్పటికే గోదావరి డెల్టా సిస్టం సీఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై ఇప్పుడు పూర్తి స్థాయి సీఈగా నియమితులయ్యారు.

సమన్వయంతో కాలువల మరమ్మతులు

అమలాపురం రూరల్: ప్రస్తుత క్లోజర్ సమయంలో పంట కాలువల మరమ్మతు పనులను సమన్వయంతో సమర్థవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో క్లోజర్ పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. రుతుపవనాలు వచ్చే లోగా సమగ్రంగా పూడికలు తొలగించి, పంటలు ముంపు బారిన పడకుండా, మురుగునీరు సవ్యంగా దిగువకు పారేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పనులు జూన్ మొదటి వారానికి పూర్తి చేయాలన్నారు. రూ.10 లక్షల లోపు నామినేషన్ పద్ధతిలో, రూ.10 లక్షలు దాటిన పనులను టెండర్ ప్రాతిపదికన నిర్వహించాలని స్పష్టం చేశారు. డీఆర్ఓ రాజకుమారి, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, జలవనరుల శాఖ సెంట్రల్ డివిజన్ ఈఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు భంగపాటు

- పదవుల పందేరంలో అవమానం
- కౌడా చైర్మన్, జనసేన నేతకే డీసీసీబీ కిరీటం
- 'దేశం' అధిష్టానంపై పిల్లి సత్తిబాబు వర్గం గుర్రు
- కోనసీమకు డీసీఎంఎస్‌తో సరి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: టీడీపీలో బీసీలు భంగపాటుకు గురయ్యారు. పదవుల పందేరంలో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆవిర్భావం నుంచీ పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేస్తున్న తమకు ప్రాధాన్యం లేకుండా చేస్తున్నారని, అప్రధానమైన పదవులతో చేతులు దులిపేసుకుంటున్నారని మండిపడుతున్నారు. బీసీలే తమ పార్టీకి బలం, బలగమని గొప్పలకు పోయే టీడీపీలో పదవులకు వచ్చేసరికి మోకాలడ్డుతున్నారని ఆ సామాజికవర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తమ సామాజిక వర్గానికి సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని బీసీలు ఆగ్రహోదగ్రులవుతున్నారు. గతంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం కలిగిన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చిన రోజులు గుర్తుకు తెచ్చుకుని.. ఇప్పుడు కేవలం జిల్లా స్థాయిలో కూడా సరైన ప్రాధాన్యం లేని పోస్టులతో అవమానించారని ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పెద్ద పీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్ని విధాలా పెద్ద పీట వేయడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. నామినేటెడ్ పదవులే కాకుండా చట్టసభలకు కూడా పంపించిన ఘనత నాడు వైఎస్సార్ సీపీకే దక్కింది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా తొలిసారిగా రాజ్యసభకు బీసీలను పంపిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. మంత్రిగా ఉన్న పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఏకంగా పెద్దల సభకు పంపించారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానాన్ని తొలిసారి బీసీలకు కేటాయించి మార్గాని భరత్‌రామ్‌ను ఎంపీని చేశారు. కోనసీమ నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, కాకినాడ నుంచి కర్రి పద్మశ్రీ వంటి వారిని శాసన మండలికి పంపించారు. బీసీలకు వైఎస్సార్ సీపీ అంత ప్రాధాన్యం ఇస్తే.. కూటమిలో అప్రధాన పదవులతో మమ అనిపించేస్తున్నారని ఆ సామాజిక వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

'ఢీ'సీసీబీ

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ పదవిని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు మొదటి నుంచీ ఆశించి చివరకు భంగపాటుకు గురయ్యారు. కూటమి పొత్తులో కాకినాడ రూరల్ సీటును త్యాగం చేసి, జనసేన గెలుపు కోసం పని చేయడమే తాము చేసిన పాపమా అని సత్తిబాబు వర్గం ప్రశ్నిస్తోంది. డీసీసీబీ పదవి వారికి రాకుండా జనసేన వైపు నుంచి అడ్డం పడ్డారనే ప్రచారం తెర మీదకు వచ్చింది. అనంతలక్ష్మి లేదా సత్తిబాబుల్లో ఎవరికి డీసీసీబీ దక్కినా రూరల్ నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి పోటీగా నిలుస్తారనే ఉద్దేశంతోనే మోకాలడ్డారని కూటమి నేతలు చెప్పుకొంటున్నారు. తమకు జరిగిన అన్యాయంపై అధిష్టానం వద్దనే తేల్చుకుంటామని సత్తిబాబు వర్గం అంటోంది.
- ఇదే సామాజికవర్గం నుంచి కోనసీమలోని కొత్తపేటకు చెందిన శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్) పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. ఆవిర్భావం నుంచీ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఆయనను కూడా పక్కన పెట్టడాన్ని ఆ వర్గం ప్రశ్నిస్తోంది. ఒకవేళ పొత్తులో భాగంగా జనసేనకు డీసీసీబీని కేటాయించాలనుకుంటే, ఇప్పటికే నామినేటెడ్ పదవి పొందిన తుమ్మల రామస్వామి(బాబు)కే మళ్లీ కట్టబెట్టడమేమిటని, ఆ పార్టీలో బీసీ నాయకులే లేరా అని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు రెండూ బీసీలను ఓటు బ్యాంకుగానే పరిగణిస్తుండటాన్ని ఆ సామాజికవర్గం జీర్ణించుకోలేకపోతోంది. డీసీసీబీ బీసీలకు ఇవ్వకూడదని ఎక్కడైనా చట్టంలో ఉందా అని నిలదీస్తోంది.

ఆప్కాబ్‌పై 'మెట్ల' ఆశలు గల్లంతు

నామినేటెడ్ పందేరంలో మాజీ మంత్రి దివంగత డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు తనయుడు రమణబాబుకు మొండిచేయే ఎదురైంది. ఆప్కాబ్ చైర్మన్‌గిరీ కోసం ఆయన మొదటి నుంచి తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. చంద్రబాబు, లోకేష్.. ఇలా ముఖ్యులందరినీ కలిసినా ఫలితం దక్కలేదని మెట్ల వర్గం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. చంద్రబాబు సొంత సామాజికవర్గం నుంచి గన్ని వీరాంజనేయులుకు అగ్రతాంబూలం ఇచ్చారు. ఇలా ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీల్లో నామినేటెడ్ పోస్టులు రచ్చరచ్చ అవుతున్నాయి.

అప్రధాన పోస్టుతో సరి

బీసీ సామాజికవర్గంలో శెట్టిబలిజలు డీసీసీబీ పదవిని ఆశిస్తే చివరకు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌తో సరిపెట్టారు. దీనిని అమలాపురం రూరల్ ప్రాంతానికి చెందిన పెచ్చెట్టి చంద్రమౌళికి ఇచ్చారు. తమ వర్గానికి పెద్దగా ప్రాధాన్యం లేని ఈ పోస్టు ఇచ్చి అన్యాయం చేశారని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పోస్టు ఇవ్వడానికి కూడా కూటమి పెద్దలు ముప్పుతిప్పలు పెట్టారని అంటున్నారు. అదే డీసీసీబీకి వచ్చేసరికి జనసేన నుంచి ఇప్పటికే ఒక పదవిలో ఉన్న వ్యక్తికే మళ్లీ ఈ పదవి కూడా ఇవ్వడం ద్వారా కూటమి శ్రేణులకు ఎటువంటి సంకేతాలు ఇవ్వదలుచుకున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు.

మళ్లీ ఆయనకేనా..!

జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు గతంలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఈ పదవి దక్కి ఆరు నెలలు కూడా గడవకుండానే ఇప్పుడు ఆయనకే డీసీసీబీ చైర్మన్‌గిరీ కూడా ఇవ్వడంలో ఔచిత్యమేమిటని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. (కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు బాబు ప్రకటించారు.) డీసీసీబీ చైర్మన్‌గా అర్హత కలిగిన మరో నాయకుడే జనసేనలో లేరా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా కూటమిలోని రెండు పార్టీలూ ఓట్ల కోసం బీసీలను కరివేపాకుల్లా వాడుకుని ఆనక గాలికి వదిలేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

గడువు ముగిసిన బీరు బాటిళ్లు ధ్వంసం



గడువు ముగిసిన బీరు బాటిళ్లను ధ్వంసం చేస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం పరిధిలోగల బీరు ఫ్యాక్టరీలో కాలం చెల్లిపోయి నిల్వ ఉన్న సుమారు ఆరువేల కేసుల బీర్‌ను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇలో యస్ బ్రావరిజస్‌కు చెందిన ఫ్యాక్టరీలో బీరు తయారు అవుతుంది. కొంతకాలంగా బీరు తయారీ నిలిచిపోయింది. దీంతో గోడౌన్ ఖాళీ చేయడంలో భాగంగా ఎక్సైజ్ అధికారుల సమక్షంలో కాలం చెల్లిన బీరు సీసాల స్టాక్‌ను ధ్వంసం చేస్తున్నారు. సుమారు ఆరువేల కేసులను ధ్వంసం చేయాల్సి ఉండగా సోమవారం సుమారు 1,000 కేసుల బీర్ సీసాలను ధ్వంసం చేశారు. బుధవారం కూడా ఈ ప్రక్రియ జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఫలిస్తున్న పంచ్‌తంత్రం!



రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన మహిళా బాక్సర్లు

- రింగ్‌లోకి దిగితే పతకం రావాల్సిందే
- సత్తా చాటుతున్న పిఠాపురం మహిళా బాక్సర్లు



శిక్షణ పొందుతున్న మహిళా బాక్సర్లు



శిక్షణ పొందుతున్న మహిళా బాక్సర్లు

పిఠాపురం: నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలనే ఆలోచన వారిని క్రీడల వైపు అడుగులు వేసేలా చేసింది. ఈ ఆటకు ఆడవారెందుకు అనే క్రీడలోనే పట్టుదల వారిని బాక్సింగ్ వైపు నడిపించింది. రింగ్‌లోకి దిగితే పతకం ఖాయం అనే రీతిలో తమ ప్రతిభా పాటవాలను చూపిస్తున్నారు పిఠాపురానికి చెందిన మహిళా బాక్సర్లు. ఒలింపిక్ పతకాన్ని అందించడమే తమ లక్ష్యం అంటున్నారు వీరు. ఇటీవల భారత్ బాక్సింగ్‌లో దూసుకెళ్తోంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లతో పాటు ఆసియా, కామన్వెల్త్, అంతర్జాతీయ ఈవెంట్‌లలో భారత ఆటగాళ్లు రాణిస్తున్నారు. బాక్సింగ్‌లో టాప్ 5 దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా భారత మహిళలు ఆడిన 12 చాంపియన్ షిప్‌లలో 10 గోల్డ్ మెడల్లతో సహా 39 పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ మెడల్స్ సాధించిన వారి జాబితాలో తదుపరి తమ పేరు నమోదు చేసుకుంటామంటున్నారు ఇక్కడి మహిళా బాక్సింగ్ క్రీడాకారులు.

మహిళా బాక్సర్లు సత్తా చాటుతున్నారు



నేను 8 సంవత్సరాల నుంచి పిఠాపురంలో బాక్సింగ్ శిక్షణ ఇస్తున్నాను. నా దగ్గర 150 మంది 10 నుంచి 30 సంవత్సరాల వయసు ఉన్న పురుషులు, మహిళలు ఉన్నారు. వారిలో మహిళా బాక్సర్లు 70 మంది వరకు ఉన్నారు. ఇప్పటివరకు 30 మంది మహిళా బాక్సర్లు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. 40 మంది జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. నలుగురు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. బాక్సింగ్ యుద్ధ కళ. బాక్సింగ్‌లో సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్స్ మెన్ అండ్ వుమెన్ విభాగాలు ఉంటాయి. వయసును బట్టి బరువును బట్టి పోటీ ఉంటుంది. బాక్సింగ్ నేర్చుకుని పతకాలు సాధిస్తే విద్య, ఉద్యోగాల్లో 3 శాతం స్పోర్ట్స్ కోటా ఎంతగానో ఉపయోగపడుతుంది. బాలికలు ఎక్కువగా ఈ క్రీడ పట్ల మక్కువ చూపుతున్నారు.

– పి.లక్ష్మణరావు, బాక్సింగ్ కోచ్, పిఠాపురం

ఒలింపిక్ మెడల్ సాధించడమే ధ్యేయం



నేను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా తండ్రి బ్యాంక్ ఉద్యోగి. నాకు చిన్నప్పటి నుంచి బాక్సింగ్ అంటే ఇష్టం. నా సరదాను చూసి నా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. నేను మా కోచ్ లక్ష్మణరావు దగ్గర చేరి బాక్సింగ్ నేర్చుకున్నాను. ఏడాదిన్నర కాలంలోనే అన్ని మెళుకువలు నేర్చుకుని కాకినాడ డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ బాక్సింగ్‌కు జిల్లా స్థాయిలో ఎంపికయ్యాను. పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించాను. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాక్సింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాను. విశాఖపట్నంలో జరిగిన యూత్ వుమెన్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించాను. ఒలింపిక్ మెడల్ సాధించడమే నా ధ్యేయం.

– జే ఐశ్వర్య సూరి దీపిక, బాక్సింగ్ క్రీడాకారిణి, పిఠాపురం

పట్టుదలతో నేర్చుకున్నా



క్రీడల్లో మంచి ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే ఆలోచన ఉండేది. ఏ ఆటలో నాకు మంచి జరుగుతుందనేది అర్థమయ్యేది కాదు. కాని పిఠాపురంలో బాక్సింగ్ క్రీడలో శిక్షణ ఇస్తున్న కోచ్ లక్ష్మణరావు వద్దకు వెళ్లి మాట్లాడగా నీవు బాక్సింగ్ బాగా ఆడగలుగుతావు అంటు ప్రోత్సాహించారు. ముందు కొంత భయమేసింది ఇంట్లో వాళ్లు బాక్సింగ్ అంటే చాలా ధైర్యం ఉండాలి.. జాగ్రత్త అన్నారు. కాని మా కోచ్ చాలా ధైర్యం చెప్పారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో బాక్సింగ్ నేర్చుకున్నా. పిఠాపురంలో జరిగిన యూత్ వుమెన్ బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించాను. విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ వుమెన్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించాను. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాను. జాతీయ స్థాయిలో మంచి పతకాలు సాధించడమే ధ్యేయం.

– అదబాల వైష్ణవి, బాక్సింగ్ క్రీడాకారిణి, మల్లాం, పిఠాపురం మండలం

స్పోర్ట్స్ కోటాలో ఉన్నత స్థానం సాధిస్తా



ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పూర్తి చేశాను. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నాను. నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం మా తల్లిదండ్రులు నా ఇష్టాన్ని గమనించి కోచ్ లక్ష్మణరావు దగ్గర జాయిన్ చేశారు. ఆయన నాకు ముందుగా ధైర్యం చెప్పి బాక్సింగ్‌లో మెళుకువలు నేర్పించారు. ఇప్పుడు నేను రాష్ట్ర బాక్సర్‌గా పేరు పొందాను. స్పోర్ట్స్ కోటాలో డాక్టర్ అయి పేదలకు ఉచిత వైద్యం చేయడమే నా లక్ష్యం.

– కాకాద హరిణి, బాక్సింగ్ క్రీడాకారిణి, పిఠాపురం

ఇదేం ఆటంకం?



> 14 years and below Age Group : Rs.1000/-
> 15 years and above Age Group : Rs.1500/-

> 14 years and below Age Group : Rs.1000/-
> 15 years and above Age Group : Rs.1500/-

స్విమ్మింగ్ పూల్‌లో డీఎస్ఏ అధికారులు అతికించిన రుసుము వివరాలు

- డీఎస్ఏలో శిక్షణ పేరుతో దోపిడీ
- కొన్ని క్రీడల్లో అనధికార వసూళ్లు
- వెలవెలబోతున్న శిబిరాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రైవేట్ శిక్షణకు అనుమతులు



డీఎస్ఏలో స్విమ్మింగ్ శిక్షణ



డీఎస్ఏ ముఖ ద్వారం



డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వేసవి సెలవులను ఊరికే గడిపేయకుండా విద్యార్థులు తమకు నచ్చిన ఆటల్లో మెళుకువలు నేర్చుకుని ఉత్తమ క్రీడాకారులుగా తయారు కావడం కోసం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ... రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సహకారంతో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాలు మే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 50 శిబిరాలు నిర్వహిస్తుండగా, కాకినాడ క్రీడామైదానం బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్, జుడో, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, టెన్నిస్‌లో వేసవి శిక్షణ అందిస్తున్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో కోచ్‌లు లేని కారణంగా శిక్షణ ఇవ్వడం లేదు. సెలవుల్లో శిక్షణకు హాజరవుతున్న క్రీడాకారుల నుంచి కొన్ని క్రీడల్లో కోచ్‌లు అనధికారంగా డబ్బు వసూలు చేస్తూ డీఎస్‌ఏ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరి కొందరు వ్యక్తులకు డీఎస్‌ఏ అధికారులే స్వయంగా ప్రైవేటుగా శిక్షణ నిర్వహించుకునేందుకు అనుమతులు ఇస్తూ పరోక్షంగా వారిని ప్రోత్సహిస్తున్నారనే వాదన క్రీడాసంఘాల్లో వినిపిస్తోంది. వేసవి వచ్చిందంటే స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. డీఎస్‌ఏ ఆదాయ వనరుల్లో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ కీలకం. అయితే డీఎస్‌ఏ అధికారులు స్విమ్మింగ్ పూల్‌ను గతంలో ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. వారు నిర్వహించలేక డీఎస్‌ఏకు అప్పజెప్పారు. ప్రస్తుతం సిమ్మింగ్ పూల్ నిర్వహణ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డీఎస్‌ఏ నిబంధనల ప్రకారం 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు రూ.1000, 15 సంవత్సరాలు దాటిన వారికి రూ.1,500 వసూలు చేయాలి. కానీ 14 సంవత్సరాల లోపు వారి నుంచి రూ.2,000, 15 సంవత్సరాల పై బడిన వారి నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారు. వేసవి క్రికెట్ శిక్షణకు రూ.3,000 వసూలు చేస్తున్నారు. టేబుల్ టెన్నిస్ కోచ్ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో కోచ్ లేకపోవడంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు శిక్షణ అందిస్తూ డీఎస్‌ఏకు రూపాయి కట్టకుండా సొమ్ము చేసుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమై 13 రోజులు కావస్తున్నా ఏ క్రీడలో ఎంత మందికి శిక్షణ అందిస్తున్నారనే వివరాలు డీఎస్‌ఏలో లేక పోవడం గమనార్హం. ఏది ఏమైనా ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాల్లో ఆశించిన స్థాయిలో క్రీడాకారులు కానరావడం లేదు. ముఖ్యంగా బాలికలు చూపిన ఆసక్తి బాలురు చూపడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు ఇదే అదనుగా అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని డీఎస్‌ఏను గాడిలో పెట్టాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై మంగళవారం డీఎస్‌ఏ ముఖ్యక్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌ను వివరణ కోరగా డీఎస్‌ఏ నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ వసూలు చేయడానికి వీలు లేదన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకుని, క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

ఇసుక లారీ ఢీకొని కౌలు రైతు మృతి



మృతుడు రమణ (ఫైల్)

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు గ్రామానికి చెందిన సూరెడ్డి రమణ (48)ను ఇసుక లారీ ఢీకొనడంతో మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. మంగళవారం కౌలు రైతు అయిన సూరెడ్డి రమణ తుని రైతుబజారులో కూరగాయలు విక్రయించుకుని మోపెడ్‌పై స్వగ్రామానికి వస్తుండగా వెలంపేట వై.జంక్షన్‌లో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రమణను తుని ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



యువకుడి మృతదేహం

తుని: రైలు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై జీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..తుని–హంసవరం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 20 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు మృతి చెందాడు. మృతుడు నలుపురంగు ట్రాక్ ధరించి ఉన్నాడు. చేతిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి దగ్గర ఇతర ఏ ఆధారాలూ లభించలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఏలూరులో కలవచర్ల మహిళ...

రాజానగరం: భర్తతో కోపంతో పుట్టింటికి వెళ్లిన మహిళ ఊహించని ప్రమాదానికి గురై అందరికీ దూరమైంది. తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్న మండలంలోని కలవచర్లకు చెందిన బొమ్మోతు కుమారి (40) ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోవడంతో మృతిచెందింది. ఏలూరు రైల్వే స్టేషను సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని ముక్కినాడకు చెందిన కుమారికి కలవచర్లకు చెందిన ఏసుతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా, కుమార్తెకు వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబ పరంగా భార్యాభర్తల నడుమ ఏర్పడిన గొడవలతో కుమారి కోపంతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఆమె తల్లిదండ్రులు మండెల సత్యనారాయణ, పాపలు పనుల కోసం హైదరాబాద్‌కి పయనమవడంతో వారితోపాటు తాను కూడా గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరింది. డోరులో నిలబడివున్న ఆమె ఏలూరు సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను రైల్వే పోలీసులు ఏలూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె భర్త ఏసు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, మృతురాలిని తన భార్యగా నిర్ధారించాడు. కేసును ఏలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చంటమ్మ (ఫైల్)

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శతాధిక వృద్ధురాలు అల్లిమిల్లి చంటమ్మ(109) మంగళవారం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు ధర్మరాజు, అర్జునుడు, భీముడు, నకులుడుతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరితో పాటు 90 మంది మనుమలు, మునిమనుమలు ఉన్నారు. ఉదయం వరకు ఆర్యోంగా ఉన్న ఆమె టిఫిన్ చేసిన అనంతరం మరణించారు.

తనయుడికి తల్లి తలకొరివి



కుమారుడి అంత్యక్రియల్లో పాల్గొన్న తల్లి

మామిడికుదురు: సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో జరిగిన ఈ సంఘటన పలువురి హృదయాలను కదిలించింది. సాధారణంగా హిందూ ధర్మంలో తల్లితండ్రులకు కొడుకులు దహన సంస్కారాలు నిర్వహించడం పరిపాటి. కానీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలెంలో మంగళవారం కన్నతల్లి కొడుకుకు.. దహన సంస్కారాలు నిర్వహించింది. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం దారతిప్ప సమీపంలో 216 రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కామాని దుర్గాప్రసాద్ (32) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఇతను తెలంగాణలోని ఖమ్మంలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్యాపిల్లలతో అక్కడే ఉంటున్న దుర్గాప్రసాద్ స్నేహితుడి వివాహం కోసం నరసాపురం వచ్చాడు. ఖమ్మం నుంచి వచ్చిన తన మిత్రుని కుటుంబానికి అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేయించిన అనంతరం నరసాపురంలో రైలెక్కించాడు. తర్వాత బంధువులను కలిసేందుకు మోరి వెళ్లాడు. మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. దుర్గాప్రసాద్ తండ్రి గతంలోనే మరణించడంతో, అతని పిల్లలు కూడా చిన్న వయసు వారు కావడంతో తల్లి ఆదిలక్ష్మి ముందుకొచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించింది. ఈ ఘటన పలువురికి కంట తడి పెట్టించింది.

ఘరానా దొంగ అరెస్టు

బనశంకరి: బెంగళూరులో చోరీలకు పాల్పడుతున్న ఏపీలోని తూర్పు గోదావరికి చెందిన ఘరానా దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల నగరంలో కొడిగేహళ్లిలో ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకెళ్లారు. పోలీసులు గాలించి జేబీ నగరలో నివసించే గోదావరి వాసి కామేపల్లి శ్రీనివాస్ అలియాస్ కార్తీక్ (39)ను అరెస్టుచేశారు. ఇతడి వద్ద నుంచి రూ.9.20 లక్షల విలువచేసే 148 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గత నెల 16వ తేదీన చోరీ చేసిన తరువాత ఓ ప్రైవేటు హాస్టల్‌లో మకాం వేశాడు. పోలీసులు సీసీ కెమెరాల చిత్రాలు, ఇతర ఆధారాల ప్రకారం పట్టుకున్నారు. కార్తీక్‌కు దొంగతనాలే వృత్తి అని, బీదర్, హైదరాబాద్, సైబరాబాద్‌తో పాటు 10 పోలీస్ స్టేషన్లలో పాత నేరస్తుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. కార్తీక్, మోహన్‌రుద్ర అనే పేర్లతో తిరుగుతూ చోరీలకు పాల్పడేవాడు. ఇతడిపై ల్యాప్‌టాప్, ఇళ్లలో చోరీలతో పాటు 88 కి పైగా కేసులు ఉన్నట్లు చెప్పారు.

కుక్కలు, పందుల నివారణకు చర్యలు

మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు



కమిషనర్లతో సమీక్షిస్తున్న రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు

అమలాపురం టౌన్: మున్సిపల్ రీజనల్ పరిధిలోని నగరాలు, పట్టణాల్లో కుక్కలు, పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజమహేంద్రవరం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ఏర్పాట్లు చేశామని ఆర్డీ చెప్పారు. ఇందు కోసం ప్రతి మున్సిపాలిటీలో కుక్కల కుటుంబ నియంత్రణ కోసం ఆపరేషన్ కేంద్రాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అమలాపురం మున్సిపాలిటీలో రూ.15 లక్షలతో కుక్కల ఆపరేషన్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ మున్సిపాలిటీలో పందులను నివారించే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పట్టణాల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పన్నుల వసూళ్లు నూరు శాతం జరిగేలా రెవెన్యూ విభాగాలు నిమగ్నం కావాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా విభాగాలపై ఆయన చర్చించారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అమలాపురం కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, మండపేట కమిషనర్ టీవీ రంగారావు, కొవ్వూరు కమిషనర్ నాగేంద్రకుమార్, నిడదవోలు కమిషనర్ కృష్ణవేణి, రామచంద్రపురం డీఈఈ శ్రీకాంత్, ముమ్మిడివరం కమిషనర్ వర్మతో పాటు అధికారులు పాల్గొన్నారు.

కుక్కల ఆపరేషన్ కేంద్ర భవన నిర్మాణం పరిశీలన: స్థానిక 27వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మితమవుతున్న కుక్కల ఆపరేషన్ కేంద్ర భవనాన్ని ఆర్డీ నాగ నరసింహారావు పరిశీలించారు. సమీక్షా సమావేశం అనంతరం పట్టణంలో ఆయన పర్యటించి పలు విభాగాలను సందర్శించారు. డ్రైయిన్లతో పూడిక తీయాల్సిన డీఈఈ నాగ సతీష్‌తో ఆర్డీ చర్చించారు.

మైనింగ్ స్క్వాడ్‌పై దాడి

అంబాజీపేట: సినీ ఫక్కీలో మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిపై దాడి చేసి కంపెనీకి చెందిన కారును ఐదుగురు అపహరించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సుధాకర్ ఇంఫ్రాటెక్ కంపెనీకి జిల్లా స్పెషల్ మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిగా ఊడిమూడి అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన అనిల్‌కుమార్‌తో పాటు తన తోటి ఉద్యోగులు చింతపల్లి ప్రవీణ్‌కుమార్, గూడూరి రూప్‌కాంత్‌లతో కలిసి మట్టి, ఇసుక వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో అంబాజీపేట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నంబర్ లేని ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా ఆ వాహనాన్ని ఆపి బిల్లు చూపించమని అనిల్‌కుమార్ అడిగారు. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ అతని ఓనర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో పి.గన్నవరానికి చెందిన మట్టపర్తి పండుతో పాటు మరో నలుగురు అక్కడకు వచ్చారు. అనిల్‌కుమార్‌తో పాటు వారి ఉద్యోగులతో ఘర్షణకు దిగారు. అనిల్‌కుమార్‌ను కొబ్బరి కమ్మలు, రాళ్లతో పండు, అతని వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. అనంతరం ఇంఫ్రాటెక్ కంపెనీకి చెందిన వాహనాన్ని పండు, అతని వర్గీయులు తీసుకుపోయి ఆ వాహనంలో ఉన్న కంపెనీ బిల్లు పుస్తకాలు, రూ.1.30 లక్షల నగదును అపహరించారు. బాధితుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.